సాక్షి ఒడిశా
శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,84,288లు, బంగారం 7గ్రాముల 700 మిల్లీగ్రాము, వెండి 37గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కనుమరుగైన గిరిధారి..

శ్రీమందిరంలో గిరిధారి అలంకరణ కనుమరుగైంది. కొన్నాళ్లు కొనసాగించినా మళ్లీ ఆపేశారు.

-10లో.



మగశిశువు దత్తత

పశ్చిమ బెంగాల్ దంపతులకు మగ శిశువును దత్తత ఇచ్చారు. పర్లాకిమిడిలో ప్రక్రియ జరిగింది.

-10లో.

న్యూస్‌రీల్

'ఫేస్‌బుక్‌లో అభ్యంతరకర పోస్టులు తక్షణమే తొలగించాలి'

భువనేశ్వర్: బిజు జనతా దళ్ అధ్యక్షుడు, విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అత్యున్నత రాజకీయ నాయకులలో ఒకరుగా కొనసాగుతున్నారు. ఆయన చికిత్స కోసం ఆస్పత్రిలో చేరిన సందర్భంగా అతని సన్నిహితులు వీకే పాండ్యన్, అతని భార్యపై ఫేస్‌బుక్‌లో కొన్ని అత్యంత అవమానకరమైన, అసభ్యకరమైన పోస్టులను ప్రసారం చేశారు. దీనిపై నవీన్‌పట్నాయక్ సన్నిహితులు ఆవేదన వ్యక్తం చేశారు. మెటాతో సంప్రదించి తక్షణమే పోస్టులు తొలగించడంతో పాటు వాటిని ఎవరు వేశారో వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని బిజు జనతా దళ్ ఐటీ, సోషల్ మీడియా సెల్ ఇంచార్జి, మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ అమర్ పట్నాయక్ రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదును దాఖలు చేశారు. బాధ్యులైన వారిని గుర్తించి అరెస్టు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎలాంటి చర్య తీసుకోకపోతే, ఈ పోస్టులు రాష్ట్ర భారతీయ జనతా పార్టీ, మోహన్ చరణ్ మాఝి ప్రభుత్వం ఆదేశాల మేరకు నకిలీ హ్యాండిళ్ల నుంచి ఈ పోస్టులు విడుదలై ప్రసారం చేసినట్లు విశ్వసించాల్సి వస్తుందన్నారు.

పద్మపూర్‌ను ఎన్‌ఏసీగా గుర్తించాలి



సబ్ కలెక్టర్ దుదుల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని పద్మపూర్‌ను ఎన్‌ఏసీగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో నేతృత్వంలో సబ్ కలెక్టర్ దుదుల్ అభిషేక్ దిలీప్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం పద్మపూర్ సమితిని ఎన్‌ఏసీగా గుర్తించేందుకు గత బీజేడీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే బీజేపీ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జాబితాలో పద్మపూర్‌ను విస్మరించడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించి పద్మపూర్‌ను ఎన్‌ఏసీగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాజీవ్ లోచన్ సాహు, రమేష్ చంద్ర పండ, ఉదయ్ సాహు, అనిల్ కుమార్ చౌదరి, జగన్నాథ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం



ఇంద్రావతి రిజర్వాయర్ ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ తదితరులు

కొరాపుట్: ఇంద్రావతి రిజర్వాయర్ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా మారుస్తామని బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరి శంకర్ మజ్జి ప్రకటించారు. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి ఖాతీగుడ సమీపంలో అప్పర్ ఇంద్రావతి హైడ్రో ఎల్రక్టిసిటీ పవర్ ప్రాజెక్ట్‌కి అనుసంధానం ఉన్న రిజర్వాయర్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. అక్కడ ఎకో టూరిజం ఏర్పాటుకి సాధ్యాసాధ్యాలు గురించి అధికారులతో చర్చించారు. వీలైనంత త్వరలో నివేదికలు సమర్పించాలని సూచించారు. ఆయనతో పాటు కలెక్టర్ మహేశ్వర్ స్వయ్, తెంతుకుంటి బీడీవో మనోజ్ కుమార్ పాణిగ్రాహి, బీజేపీ నాయకులు సురేష్ శాస్త్రి, దేవదాస్ మహంకుడోలు ఉన్నారు.

బాలుని మృతదేహం లభ్యం



బాలుని మృతదేహం తీసుకెళ్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పుటాసింగి పోలీస్‌స్టేషన్ పరిధి టిటిమిరి పంచాయతీ జంగపూర్‌ముండా గ్రామ సమీపంలోని మహేంద్రతనయ నదిలో బాలుడి మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది గురువారం స్వాధీనం చేసుకున్నారు. మృతుడు టిటిమిరి గ్రామానికి చెందిన జాస్మిన్ సాబొరా(6)గా గుర్తించారు. బుధవారం బాలుడి తల్లి లయని, తండ్రి పితసాబొరొలు వ్యవసాయ పనులకు వెళ్లగా జాస్మిన్ తన స్నేహితులతో కలిసి నదికి స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి బాలుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఎస్‌ఐఆర్‌కు బీజేడీ వ్యతిరేకం



భారత ఎన్నికల సంఘంతో కలిసిన బీజేడీ ప్రతినిధి బృందం



బీజేడీ ప్రతినిధి బృందంతో చర్చించిన భారత ఎన్నికల సంఘం ప్రముఖులు

- భారత ఎన్నికల కమిషన్‌తో బీజేడీ ప్రతినిధి బృందం భేటీ

భువనేశ్వర్: బీహార్ తరహాలో ఒడిశాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అమలు పట్ల బిజు జనతా దళ్ వ్యతిరేకత వ్యక్తం చేసింది. ఈ చర్యతో పెద్ద సంఖ్యలో అర్హత కలిగిన ఓటర్లు మినహాయించబడతారని, ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉన్నందున ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నట్లు భారత ఎన్నికల సంఘానికి బిజు జనతా దళ్ ప్రతినిధి బృందం స్పష్టం చేసింది. బీహార్‌లో ఈ ప్రక్రియలో వాస్తవ ఓటర్లను విస్మరించారని తెలిసిందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించే సదుద్దేశంతో అన్ని వర్గాల వాటాదారుల చురుకైన భాగస్వామ్యంతో ఎస్ఐఆర్ అమలు చేయాలని భారత ఎన్నికల సంఘానికి ప్రతినిధి బృందం విన్నవించింది. ఈ బృందం ప్రతిపాదనల్ని పరిగణనలోకి తీసుకుని పరిశీలించడం జరుగుతుందని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) అభయం ఇచ్చింది. గత సార్వత్రిక ఎన్నికల్లో భారీ అవకతవకలు తలెత్తాయి. వాటికి సంబంధించి గత ఏడాది డిసెంబర్ నుంచి డజనుకు పైగా లేవనెత్తిన వివిధ అంశాలపై ఎన్నికల సంఘం స్పందన కొరవడిందని ప్రతినిధి బృందం విచారం వ్యక్తం చేసింది. అభ్యర్థన మేరకు ఎన్నికల సంఘం ఫారం 17–సి జారీ చేయకపోవడంతో ఎన్నికల ఫలితాలకు సంబంధించి ఓటర్ల మనస్సులో ఏర్పడిన సందేహాలు నివృత్తి కావడం లేదని వివరించారు. 2024 ఎన్నికలు పురస్కరించుకుని ఈవీఎంలలో నమోదైన ఓట్లు, లెక్కించిన ఓట్ల మధ్య వ్యత్యాసం పట్ల సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. బూత్ స్థాయి, పార్లమెంటరీ నియోజకవర్గం, అసెంబ్లీ నియోజకవర్గం మధ్య వ్యత్యాసం గురించి పార్టీ లేవనెత్తిన అభ్యంతరాలపై ఇంత వరకు సంతృప్తికరమైన సమాధానం రాలేదని ఎన్నికల సంఘం ప్రముఖులతో సమావేశంలో బీజేడీ ప్రతినిధి బృందం ప్రస్తావించింది. ఓటింగ్ తర్వాత, అనేక బూత్‌లలో ఫారం 17–సిలో పేర్కొన్న ఓట్ల సంఖ్య, లెక్కింపు సమయంలో వచ్చిన ఓట్ల సంఖ్యతో సరిపోల లేదు. ఇది అందరినీ ఆశ్చర్యపరిచింది. పోలింగ్ నాడు సాయంత్రం 5 గంటల తర్వాత ఓటర్ల సంఖ్య అకస్మాత్తుగా పెరగడంపై విస్మయపరిచింది. ఎన్నికల్లో స్వచ్ఛమైన, నిష్పాక్షిక ప్రక్రియ కోసం బిజు జనతా దళ్ పలుమార్లు ఎన్నికల సంఘానికి చేసిన అభ్యర్థనలు ఇంత వరకు ఎలాంటి స్పందన నోచుకోక పోవడం విచారకరమని తెలియజేశారు. దేబీ ప్రసాద్ మిశ్రా ఆధ్వర్యంలో ప్రమీలా మల్లిక్, సంజయ్ దాస్ బర్మా, డాక్టర్ అమర్ పట్నాయక్, సులతా దేవ్‌లతో సహా బీజేడీ ప్రతినిధి బృందం న్యూ ఢిల్లీ నిర్వాచన్ సదన్‌లో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషిలతో ముఖాముఖి సమావేశమై చర్చించింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘానికి తమ అభిప్రాయాలు, సూచనలను తెలియజేశారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నాయకులతో కొనసాగుతున్న సంభాషణలలో ఈ సమావేశం భాగమని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పేర్కొంది. ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడంలో ఈ సలహాలు, సూచనలు దీర్ఘకాల ప్రయోజనాలకు దోహదపడతాయని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆశాభావం వ్యక్తం చేసింది.

నేటి నుంచి బొరిగుమ్మలో నిరవధిక బంద్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి

కొరాపుట్: రాష్ట్రంలో అతి పెద్ద సమితి బొరిగుమ్మలో నిరవధిక బంద్ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీకి చెందిన జయపూర్ ఎమ్మెల్యే, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తారా ప్రసాద్ బాహిణీపతి ప్రకటించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో 12 పట్టణాలకు నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ (ఎన్ఏసి) ల హోదా ఇస్తున్నట్లు ప్రకటించిందన్నారు. కానీ అందులో బొరిగుమ్మ పట్టణం లేదన్నారు. గత ప్రభుత్వం బొరిగుమ్మని ఏన్ఏసీగా ప్రకటించినప్పటికీ అధికారం కోల్పోవడం తో అది అమలు కాలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తాను కాంగ్రెస్ పార్టీకి చెందిన వాడిని కాబట్టి బొరిగుమ్మకి అన్యాయం చేసిందన్నారు. అందుకే గురువారం నుంచి నిరవధిక బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే బొరిగుమ్మలో అన్నీ పార్టీలు ఈ బంద్‌ను సమర్థిస్తున్నాయని ప్రకటించారు. బంద్ జరిగితే ఆంధ్రా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచి పోతాయి.

నీట్ టాపర్ పూషన్ మహాపాత్రోకు అభినందనలు



పూషన్ మహాపాత్రోని అభినందించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: నీట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో మొదటి స్థానం సాధించిన పూషన్ మహాపాత్రో, ఆయన తల్లిదండ్రులకు ముఖ్యమంత్రి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ అత్యున్నత ఉత్తీర్ణత సమగ్ర ఒడిశాకు సంతోషకరమని, ఇంత కఠినమైన పోటీ పరీక్షలో విజయం సాధించి సమగ్ర భారత దేశంలోనే మొదటి స్థానం సాధించడం కచ్చితంగా ఒక సవాలని అన్నారు. ఇలాంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, యువతకు ఈ ఉత్తీర్ణత స్ఫూర్తిదాయకం అవుతుందని ముఖ్యమంత్రి అభినందించారు. మీలాంటి ప్రతిభావంతులైన, కష్టపడి పనిచేసే మరియు ఔత్సాహిక వ్యక్తుల సేవలు రాష్ట్రానికి అవసరమని. శ్రీ జగన్నాథుడి కృపతో భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి రాష్ట్ర ప్రజలకు సేవ చేస్తారని ఆశిస్తున్నానని తెలిపారు.

సెప్టెంబర్ 18 నుంచి శాసన సభ వర్షాకాల సమావేశాలు



రాష్ట్ర శాసన సభ

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ నెల 18 నుండి 25 వరకు జరగనున్నాయి. ప్రతిపక్షం లేవనెత్తే అంశాలపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని శాసన సభ వ్యవహారాల మంత్రి డాక్టరు ముఖేష్ మహాలింగ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అన్నారు. ఏడు పని దినాలు ప్రణాళిక చేసిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రయోజన అంశాలపై చర్చలు, ప్రతిపాదిత కీలక బిల్లులు, అధికార పార్టీ, ప్రతిపక్షాల క్రియాశీల భాగస్వామ్యం ఉంటాయి. ఏడు రోజులలో, ఒక రోజు ప్రైవేట్ సభ్యుల బిల్లులకు, మరొక రోజు కార్యాలయం రహిత దినం (నో ఆఫీస్ డే) ఉంటుంది. బిజినెస్ అడ్వైజరీ కమిటీ తీసుకున్న నిర్ణయాల ప్రకారం, ఈ సమావేశంలో అనేక ముఖ్యమైన బిల్లులను ప్రవేశపెట్టవచ్చు. ప్రతిపక్షాలు ప్రతిపాదించే ఏ అంశంపైనైనా ముఖ్యంగా రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపైనా చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ధ్రువీకరించింది. ప్రతిపక్ష పార్టీలు సమర్పించిన నిర్మాణాత్మక ప్రతిపాదనలపై కూడా చర్చలను ప్రభుత్వం స్వాగతిస్తుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ పేర్కొన్నారు. ఇటీవలి సంఘటనలు, భారత ప్రభుత్వం దాదాపు రూ. 8,000 కోట్లు మంజూరు చేసిన క్యాపిటల్ రీజియన్ రింగ్ రోడ్ (సీఆర్ఆర్ ఆర్), ఒడిశాకు కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ. 4,500 కోట్ల విలువైన రెండు సెమీ కండక్టర్ తయారీ యూనిట్లు, డబుల్ ఇంజిన్ ప్రభుత్వ పరిధితో సహా రాష్ట్రానికి మంజూరు చేసిన నాలుగు జలమార్గ ప్రాజెక్టులు వంటి కీలక అంశాలను ఈ సమావేశాల్లో చర్చించనున్నట్లు రాష్ట్ర శాసన సభవ్యవహారాల మంత్రి ముఖేష్ మహాలింగ్ తెలిపారు. శాసన సభ వర్షాకాల సమావేశాల్లో రాష్ట్ర ప్రయోజనాలు, కీలక బిల్లులు, రైతుల దుస్థితి, మహిళలు, బాలికలు మరియు విద్యార్థులపై నేరాలు, సామూహిక అత్యాచారం, గూండాయిజం మరియు భువనేశ్వర్ మెట్రో (రైలు) ప్రాజెక్టు నిలిపివేత వంటి సంబంధిత అంశాలను శాసన సభ వర్షా కాలం సమావేశాల్లో ప్రస్తావిస్తామని విపక్ష బిజు జనతా దళ్ నాయకురాలు ప్రమీలా మల్లిక్ అన్నారు. ఆయా అంశాల్లో ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అన్ని ముఖ్యమైన సమస్యల పట్ల ప్రభుత్వం నుండి జవాబుదారీతనం కోరడం తమ ఉద్దేశమని పేర్కొన్నారు.

అరుదైన ఊసరవెల్లి



నబరంగ్‌పూర్ జిల్లాలో ఊసరవెల్లి

కొరాపుట్: అరుదైన ఊసరవెల్లిని గిరిజనులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి పటకలియా పంచాయితీ బడకనా గ్రామంలో ఊసరవెల్లిని గిరిజనులు గమనించారు. దీన్ని చూడడం అరిష్టమని వారు భావిస్తారు. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్తలు గ్రామానికి చేరుకుని ఊసరవెల్లిని రక్షించి అటవీ శాఖాధికారులకు అప్పగించారు. వారు దాన్ని అడవిలోకి విడిచిపెట్టారు.

దసరా ఉత్సవాలకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న వినయ్ ద్వివేది తదితరులు

రాయగడ: సదరు సమితి పరిధిలోని జేకేపూర్‌లో ఉన్న జేకే పేపర్ మిల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు గురువారం భూమిపూజ కార్యక్రమం జరిగింది. జేకేపేపర్ మిల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ వినయ్ ద్వివేది ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతీ ఏడాది అత్యంత ఘనంగా జరిగే దసరా ఉత్సవాలను తిలకించేందుకు వేల సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టినట్లు ద్వివేది తెలియజేశారు. పూజా కార్యక్రమాల్లో మిల్ సీనియర్ ఉద్యోగులు బిశ్వజీత్ ద్వివేది, రాఘవేంద్ర హర్పర్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ వ్యక్తిగత కార్యదర్శిగా డాక్టర్ లలాటేందు సాహు

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్ వ్యక్తిగత కార్యదర్శిగా ఓఏఎస్ (ఎస్ఏజీ) అధికారి డాక్టర్ లలాటేందు సాహు నియమితులయ్యారు. ఒడిశా పర్యటన అభివృద్ధి కార్పొరేషన్ ఓటీడీసీ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు బదిలీ చేసి ఈ నియామకం చేసినట్లు రాష్ట్ర సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

కోలుకున్న నవీన్ పట్నాయక్



చికిత్స బృందంతో నవీన్ పట్నాయక్



ఆస్పత్రి నుంచి వి. కె. పాండ్యన్ చేయూతతో నడిచి వస్తున్న నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: బిజు జనతా దళ్ అధ్యక్షుడు, విపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ కోలుకున్నారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి నవీన్ నివాస్‌కు సురక్షితంగా చేరారు. డీహైడ్రేషన్ కారణంగా చికిత్స కోసం ఈ నెల 17వ తేదీ సాయంత్రం ఆయన ఆసుపత్రిలో చేరారు. అనారోగ్యం నుంచి కోలుకోవడంతో బుధవారం రాత్రి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజల ఆత్మీయ అనురాగాలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సహా పలువురు ప్రముఖులు ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆస్పత్రిలో తన బాగోగులు తెలుసుకునేందుకు సందర్శించిన ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్, ఇరువురు మంత్రులు రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్‌కు ఫోన్ చేసి ధన్యవాదాలు తెలిపారు.

మాజీ గవర్నర్ పరామర్శ

ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల మాజీ గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ గురువారం నవీన్ పట్నాయక్‌కు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు.

నకిలీ బంగారు శంఖంతో మోసం



వ్యాపారికి దుండగులు ఇచ్చిన నకిలీ బంగారు శంఖం

జయపురం: జయపురంలో నకిలీ బంగారు శంఖాల మోసం జరిగింది. ఒక నకిలీ బంగారంతో తయారు చేసిన శంఖాన్ని ఒక వ్యాపారికి ఇచ్చి రూ.10 లక్షలు మోసం చేసిన సంఘటన వెలుగు చూసింది. జగత్‌సింగపూర్ జిల్లా కుజంగ పోలీసు స్టేషన్ గండకిపూర్ వ్యాపారి నిత్యానంద మహాపాత్రోకి బంగారు శంఖం ఇస్తామని కొందరు మోసగాళ్లు నమ్మించి రూ.10 లక్షలు తీసుకుని మోసం చేశారు. దీంతో జయపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారని పట్టణ పోలీసు అధికారి ఉల్లాస్ చంద్ర రౌత్ వెల్లడించారు. పోలీసు అధికారి వివరణ ప్రకారం నిత్యానంద మహాపాత్రో భువనేశ్వర్‌లో వ్యాపారం చేస్తున్నారు. అతడికి జయపురంలో బంగారు శంఖం ఇస్తానని ఓ వ్యక్తి తెలిపాడు. ఈ నెల 16న స్థానిక ఒక హొటల్‌కు ఆ వ్యక్తి అతడి అనుచరులు వచ్చారు. మహాపాత్రోకు బంగారంలా కనిపించే ఒక శంఖం ఇచ్చి రూ.10 లక్షల నగదు తీసుకున్నారు. తర్వాత మహాపాత్రో బంగారు శంఖాన్ని పరీక్షించగా అది ఇత్తడి అని బయట పడింది. వారికి ఫోన్ చేస్తే స్విచాఫ్ అని వచ్చింది. దీంతో ఆ వ్యాపారి పోలీసులను ఆశ్రయించాడు. ఎస్ఐ రాజేంద్ర పంగి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ వలలో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి



బాధితుడు త్రిపాఠి

రాయగడ: సైబర్ మోసాల వలలో ఒక విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి చిక్కుకున్నారు. స్థానిక ఇందిరానగర్ మూడో లైన్‌లో నివసిస్తున్న ప్రజారోగ్య శాఖకు చెందిన విశ్రాంత ఉద్యోగి పూర్ణ చంద్ర త్రిపాఠి ఖాతా నుంచి రూ.1.24 లక్షలను సైబర్ నేరగాళ్లు స్వాహా చేశారు. ఈ మేరకు బాధితుడు స్థానిక సైబర్ సెల్‌ను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళితే.. బుధవారం బాధితుడి మొబైల్‌కు వచ్చి సందేశాన్ని తెరచి చూస్తే.. తన ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ.1.24 లక్షలు డెబిట్ అయినట్లు ఉంది. అనంతరం అతడు బ్యాంకు అధికారులకు సంప్రదించగా సైబర్ నేరగాళ్లు ఖాతా నుంచి డబ్బులు కాజేశారని తెలిపారు. అనంతరం తాత్కాలికంగా అతని బ్యాంకు ఖాతాను మూసివేశారు. కేసు నమోదు చేసిన సైబర్ పోలీస్ విభాగం ఈ మేరకు దర్యాప్తు చేస్తుంది.

ఘాటీలో కమాండర్ జీపు బోల్తా



గాయాలైన వృద్ధురాలిని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా బాయపోడ ఘాటీలో గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఓ కమాండర్ జీపు బోల్తా పడింది. ఈ ఘటనలో 25 మందికి గాయాలయ్యాయి. సాధారణంగా జీపులో 15 మంది మాత్రమే ప్రయాణించాలి. కానీ 25 మంది ప్రయాణిస్తున్నారు. కోరుకొండ సమితి నక్కమామ్ముడి పంచాయతీ ఆమలిబేడ గ్రామస్తులంతా కలిసి కుడుములగుమ్మ వద్ద జరుగుతున్న వారపు సంతకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అటుగా వెళ్తున్న వారు చూసి కుడుములగుమ్మ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బయటకు తీశారు. వారిని ముందు కుడుములగుమ్మ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని మల్కన్‌గిరి ఆస్పత్రికి పంపించారు. బలిమెల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.



చేయి విరిగిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



ప్రమాద స్థలంలో స్థానికులు



ప్రమాద స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది

క్లుప్తంగా

చెరువులో మునిగి తల్లీకూతుళ్ల మృతి

- కుమార్తెను రక్షించడానికి వెళ్లి తల్లి కూడా మృతి



తల్లీకూతుళ్ల మృతదేహాలు

కొరాపుట్: కుమార్తెను రక్షించడానికి వెళ్లి తల్లి కూడా మృతి చెందింది. గురువారం కొరాపుట్ జిల్లా నందపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో లమ్తాపుట్ సమితి కుమార్ గందన పంచాయతీ బలియా గ్రామంలో ఈ సంఘటన జరిగింది. బిలాపుట్ గ్రామ పంచాయతీ హర్గండా గ్రామానికి చెందిన నవీనా మజ్జి (40), తన కుమార్తె అంబికా మజ్జి (15)తో కలిసి అల్లం పంట సాగు కోసం వెళ్లారు. నవీనా పొలం పనిలో ఉండగా కుమార్తె అంబికా సమీపంలో ఉన్న చెరువులో స్నానానికి వెళ్లింది. లోతు తెలియక దిగడంతో అంబికా చెరువులో మునిగిపోతూ కేకలు పెట్టింది. ఇది గమనించిన నవీనా కుమార్తెను రక్షించడానికి వెళ్లి మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న నందపూర్ అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు.

హోటళ్లు, లాడ్జిలు, రెస్టారెంట్లలో తనిఖీలు



హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జయపురం: జయపురంలోని అన్ని హోటల్లు, లాడ్జీలు, రెస్టారెంట్లపై పోలీసులు బుధవారం అర్ధ రాత్రి వరకు దాడులు నిర్వహించారు. పట్టణంలో మోసగాళ్లు, దుండగులు, డెకాయిట్‌లు పెరగటంతో వారిపై పోలీసులు నిఘా పెట్టి విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జయపురం పట్టణ పోలీసు, జయపురం సదర్ పోలీసులు సంయుక్తంగా పాల్గొన్నారు. హోటళ్లు, లాడ్జీలు, రెస్టారెంట్లకు వచ్చే వారి పరిచయపత్రాలు, ఆధార్ కార్డులు పరిశీలించాలని, ఏ వ్యక్తిపైనా అయినా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. కొరాపుట్ జిల్లా ఎస్పీ ఆదేశంతో దాడులు నిర్వహించారు. జయపురం పట్టణ పోలీసు అధికారి, సదర్ పోలీసు అధికారుల నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు.

ఉత్తమ టీటీఐలకు సత్కారం

తాటిచెట్లపాలెం(విశాఖ): వాల్తేరు రైల్వే డివిజన్ టికెట్ తనిఖీ సిబ్బంది మే నెలలో రికార్డు స్థాయిలో ఆదాయం సాధించారు. ఈ నేపథ్యంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్ పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సిబ్బందిని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా గురువారం సత్కరించారు. మేలో టికెట్ తనిఖీ సిబ్బంది వివిధ రూపాలలో రూ.2,41,20,627 ఆదాయాన్ని ఆర్జించారు. గత సంవత్సరం మేలో సాధించిన రూ. 2,27,34,221 ఆదాయంతో పోలిస్తే, ఈసారి అధిక ఆదాయాన్ని నమోదు చేశారు. ఈ రికార్డు ఆదాయం సాధించడంలో వ్యక్తిగతంగా ఇద్దరు ఉద్యోగులు అద్భుతమైన పనితీరు కనబరిచారు. విజయనగరం, టీటీఐ వై. అప్పలరాజు.. 836 కేసులు నమోదు చేసి రూ.4,89,320 జరిమానాలు, అదనపు టికెట్ రుసుముగా వసూలు చేశారు. శ్రీకాకుళం రోడ్డు టీటీఐ కె.శ్రీనివాసరావు 815 కేసులు నమోదు చేసి రూ. 4,42,900 వసూలు చేశారు. వీరిని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ సమక్షంలో సత్కరించారు.

పాగురు తీతపై హర్షం



ప్రొక్లెయినర్‌తో పాగురు తీయిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు సముద్రంలో ఉప్పుటేరు కలిసిన చోట ఇసుక మేటలు వేయడంతో బూర్జపాడు పంట పొలాలు వరద నీటిలో మునిగిపోయిన విషయం విదితమే. రైతులు పడుతున్న ఇబ్బందులపై 'పాగురు తెచ్చిన చేటు' శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ప్రొక్లెయినర్ సహాయంతో పాగురు తీత పనులు చేయించారు. పంట పొలాల్లో ఉన్న వరద నీరు ఉప్పుటేరు గుండా సముద్రంలో కలవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

కళాఉత్సవ పోటీలకు ఆహ్వానం

గార: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న బాలుర, బాలికలు, ఉపాధ్యాయ యాజమాన్యాలను కళాఉత్సవ్-2025 పోటీలకు ఆహ్వానిస్తున్నట్లు వమరవల్లి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గౌరీశంకర్ గురువారం తెలిపారు. 9, 10, 11, 12వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, సంప్రదాయ కథ చెప్పడం, దృశ్య కళలు వంటి పోటీలను సెప్టెంబర్ 11, 12 తేదీల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని, వివరాలకు 7702391639, 9000726375 నంబర్లను సంప్రదించాలని కోరారు.

శ్రీ మందిరంలో ..
కనుమరుగైన గిరిధారి అలంకరణ

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుడు నిత్య శోభాయమానుడు. ఏడాది పొడవునా నిత్య నూతనంగా శోభిల్లుతాడు. పవిత్ర భాద్రపద మాసంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ప్రారంభమైన వేడుకలు నిరవధికంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా భాద్రపద మాసం కృష్ణ పక్ష త్రయోదశి నాడు శ్రీమందిరం రత్న వేదికపై మూల విరాటులు కృష్ణ బలరాం, యోగమాయ అలంకరణలో శోభిల్లాడు. వాస్తవానికి శ్రీమందిరంలో గిరి గోవర్ధన్ అలంకరణ కనుమరుగు కావడంతో ఈ అలంకరణ కొనసాగుతోంది. గురువారం మధ్యాహ్న ధూపం తర్వాత ఈ అలంకరణ సన్నాహాలు ప్రారంభించారు. రత్న వేదికపై బలభద్ర స్వామి బలరాముడి రూపంలో, మహాప్రభు శ్రీ జగన్నాథుడు శ్రీ కృష్ణుని రూపంలో, దేవి సుభద్రను యోగమాయ అలంకరణతో రూపుదిద్దారు. గతంలో ఏటా భాద్రపద మాసం కృష్ణ పక్ష త్రయోదశి నాడు స్థానిక పెద్ద ఒడియా మఠం ఆధ్వర్యంలో శ్రీమందిరం రత్న వేదికపై శ్రీ జగన్నాథునికి గిరిధారి అలంకరణ జరిగేది. కాలక్రమేణా కొన్ని సమస్యల కారణంగా ఈ అలంకరణ నిలిపివేశారు. దీర్ఘకాలం తర్వాత 1943 సంవత్సరంలో ఈ అలంకరణ పునరుద్ధరించినా తాత్కాలికంగానే కొనసాగింది. కటక్ జిల్లా సాలేపూర్ ప్రాంతం ఖొండొసాహి జమీందార్ రాయ సాహెబ్ చౌదరి గోపబంధు మిశ్రా పుత్ర సంతానం కోసం భగవంతుడిని ప్రార్థించి ఒక కొడుకును పొందాడు. ఈ సందర్భంగా దివంగత సదాశివ రథశర్మ, పుష్పాలక్ సేవకుడు అలేఖ్ కొరొ కోరిక మేరకు,



శ్రీ జగన్నాథుని గిరి గోవర్ధన్ అలంకరణ



శ్రీ కృష్ణ అలంకరణలో శ్రీ జగన్నాథుడు

సాహెబ్ నిలిపివేసినగిరి గోవర్ధన్ అలంకరణ పునరుద్ధరణకు అంగీకరించారు. యథాతథంగా పూర్వ రీతిలో పెద్ద ఒడియా మఠం ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ అలంకరణ కొద్ది కాలం మాత్రమే కొనసాగింది. ఈ అలంకరణ నిర్వహణలో వివిధ అడ్డంకులు ఎదురు కావడంతో ప్రముఖుల సంప్రదింపుల మేరకు శ్రీ మందిరంలో కృష్ణ బలరాం అలంకరణ నిర్వహించాలని నిర్ణయించారు. తదనుగుణంగా గజపతి రాజుల శాసనం ప్రకారం 1945 సంవత్సరం నుంచి ఏటా భాద్రపద కృష్ణ పక్ష త్రయోదశి నాడు క్రమం తప్పకుండా కృష్ణ బలరాం అలంకరణ కొనసాగుతోంది.

తృణధాన్యాలు పండించాలి



బహుమతి అందజేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

- జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి సంజయ్ కుమార్ దోళాయి

పర్లాకిమిడి: జిల్లా స్థాయి వ్యవసాయదారుల ఉత్పత్తుల అమ్మకాలు, మార్కెట్ లింకేజిపై జిల్లా వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ ఇండియా లిమిటెడ్ సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం హాల్‌లో పంట వైవిధ్యీకరణపై ఒక్కరోజు వర్క్‌షాపును అధికారులు గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ముఖ్య వ్యవసాయశాఖ అధికారి సంజయ్ కుమార్ దోళాయి, జిల్లా ఉద్యానవనాల శాఖ, ఉప సంచాలకులు సుశాంత కుమార్ దాస్, జిల్లాపరిశ్రమల శాఖ పర్యవేక్షకులు సునారాం సింగ్, జిల్లా ప్రాజెక్టుల అధికారి, జీవికా మిషన్ అధికారి టిమోన్ బోరా, సెంచూరియన్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాఢి, ప్రాజెక్టు ఆఫీసర్ కె.సూరజ్‌కుమార్ పాత్రో హాజరయ్యారు. రైతులు, మహిళా స్వయం సహాయక గ్రూపులు కలిసి క్రయ, విక్రయాలు సమన్వయంతో చేస్తే లాభాలు పొందవచ్చని జిల్లా పరిశ్రమలశాఖ అధికారి సునారం సింగ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ నినాదంతో తృణ ధాన్యాలు పండించి వ్యవసాయదారులు అధిక లాభాలు పొందాలన్నారు. కేవలం సబ్సిడీల కోసం కాకుండా ధాన్యేతర వాణిజ్యపంటలు, తృణ ధాన్యాలు పండించాలని జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి సంజయ్‌కుమార్ దోళాయి అన్నారు. కార్యక్రమాన్ని గుమ్మ వ్యవసాయ విస్తరణాధికారి నారాయణ చాంద్, సూరజ్ పాత్రో పలువురి రైతులకు, మహిళా గ్రూపులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

సిద్ధేశ్వర మిశ్రా, కన్హుచరణ్ భుయ్యాన్ సస్పెండ్



మాట్లాడుతున్న నబకిశోర్ శోబోరో, నారాయణరావు

పర్లాకిమిడి: బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ అధ్యక్షుడు సిద్ధేశ్వర మిశ్రా (డుల్లు), కుజాసింగి మాజీ సర్పంచ్ కన్హు చరణ్ భుయ్యాన్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టు అందిన ఫిర్యాదు మేరకు వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నబకిశోర్ శోబోరో విలేకరుల సమావేశంలో గురువారం ప్రకటించారు. స్థానిక పీడబ్ల్యూడీ డాక్ బంగళాలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నబకిశోర్ శోబోరో, మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు తదితరులు మాట్లాడారు. 2019 ఎన్నికల్లో బీజేపీలో ఉండి ఇతర పార్టీకి పనిచేయడం, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడిపై ఆక్రమణ, అనేక యువ మోర్చాలను ఏర్పాటుచేసి సమాంతర పార్టీ కార్యకలాపాలు చేస్తున్నందుకు మండలాధ్యక్షుల ఫిర్యాదు మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షునికి పంపామన్నారు. పార్టీ నాయకులు ప్రసన్నకుమార్ నాయక్, కోడూరు జీవన్, తదితరులు పాల్గొన్నారు.

10 కేజీల గంజాయి స్వాధీనం

- ఒకరు అరెస్టు



జయపురం రైల్వే స్టేషన్‌లో గంజాయితో పట్టుబడిన నిందితుడు

జయపురం: జయపురం రైల్వే స్టేషన్‌లో 10 కేజీల గంజాయిని కొరాపుట్ రైల్వే పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. రైల్వే స్టేషన్‌లో తనిఖీలు జరుపుతుండగా ఓ వ్యక్తి బస్తాతో నిలిచి ఉండటంతో పోలీసులు తనిఖీ చేశారు. ఆ బస్తాలో గంజాయి ఉండటంతో ఆ వ్యక్తి అరెస్టు చేశారు. గంజాయి 10 కేజీలు ఉన్నట్ల రైల్వే పోలీసులు వెల్లడించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. లక్ష ఉంటుందన్నారు. అరెస్టు అయిన వ్యక్తి శ్యామలేశ్వరి ఎక్స్‌ప్రెస్ రైలు కోసం బస్తాతో నిరీక్షిస్తున్నాడని, అతడు జయపురం నుంచి రాయగడ వెళ్లి అక్కడ నుంచి ఢిల్లీ మీదుగా పంజాబ్ వెళ్లనున్నట్లు వెల్లడించారు. అరెస్టు అయిన వ్యక్తి పంజాబ్ రాష్ట్ర లుధియాన ప్రాంతం అసమాన్(25) అని జీఆర్పీ అధికారి సంతోష్ మహంత వెల్లడించారు. ఈ సంఘటనపై కొరాపుట్ జీఆర్పీ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఎక్కడ నుంచి గంజాయి తీసుకు వస్తున్నాడు, ఎక్కడ అమ్ముతున్నాడనే విషయాలపై దర్యాప్తు జరుపనున్నట్లు వెల్లడించారు. తనిఖీలు నిర్వహించిన వారిలో సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణహంతి, జి.గణేష్, తదితరులు ఉన్నారు.

పశ్చిమ బెంగాల్ దంపతులకు మగ శిశువు దత్తత



పశ్చిమ బెంగాల్ దంపతులకు మగశిశువును దత్తత నిమిత్తం అందజేస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: ప్రభుత్వ స్వతంత్ర శిశు దత్తత కేంద్రం నుంచి 73వ శిశువును గజపతి జిల్లా కలెక్టర్ మధుమిత చేతులమీదుగా గురువారం సాయంత్రం పశ్చిమ బెంగాల్‌కు చెందిన దంపతులకు అప్పగించారు. స్థానిక కేంద్ర ప్రభుత్వ పెద్దాసుపత్రి క్రెడాల్ కేంద్రం వద్ద గుర్తు తెలియని తల్లి ఒక శిశువును వదిలి వెళ్లిపోయింది. జిల్లా చైల్డ్ లైన్, జిల్లా స్వతంత్ర దత్తత కేంద్రం వారు చేరదీసి సపర్యలు చేశారు. అనంతరం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ఆదేశాల మేరకు సంతాన దత్తత కేంద్రంలో పెంచారు. కేంద్ర దత్తత పోర్టల్‌లో చూసిన పశ్చిమ బెంగాల్ దంపతులు దరఖాస్తు చేసుకున్న మీదట గురువారం నాలుగేళ్ల మగ శిశువును కలెక్టర్ మధుమిత చేతుల మీదుగా అధికారికంగా అందజేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ అశ్వినీ కుమార్ మహాపాత్రో, డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి, జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి మమతా శథపతి, తదితరులు పాల్గొన్నారు.

తీరని డోలీ కష్టాలు



డోలిలో రోగిని తీసుకువస్తున్న గిరిజనులు



బురదలో డోలిని మోస్తున్న గిరిజనులు

కొరాపుట్: అనారోగ్యంతో ఉన్న రోగిని డోలీలో తరలించిన సంఘటన జరిగింది. గురువారం కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి లులా గ్రామ పంచాయతీ బారా కౌడీ గ్రామంలో లబి శాంత అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. పరిస్థితి విషమించడంతో గిరిజనలు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఆ గ్రామం వెళ్లడానికి మార్గం లేకపోవడంతో అంబులెన్స్ రెండు కిలో మీటర్ల దూరంలో నిలిచిపోయింది. దీంతో గిరిజనులు మంచాన్ని డోలిగా చేసుకోని బాధితుడిని అంబులెన్స్ వద్దకు చేర్చారు. అంబులైన్‌లో దశమంత్‌పూర్ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

ఎస్సీ యువతకు హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లాలో షెడ్యూల్డ్ కులాల యువతీ యువకులకు హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం తెలిపా రు. ప్రధాని ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏజేవై)లో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్స రం కింద జిల్లాకు చెందిన 10 మంది(పురుషులు-5, మహిళలు-5) అభ్యర్థులకు శిక్షణ ఇస్తా మని పేర్కొన్నారు. కుల, ఆదాయ, నివాస, ఆధార్ కార్డులతో పాటు కనీసం ఏడాది లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 27లో జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

సైబర్‌సెల్ నిపుణులకు వర్క్‌షాపు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఐటీకోర్, సైబర్‌సెల్ పోలీసులకు ఉబెర్ బేటా డిస్‌క్లోజర్ పాలసీపై విశాఖపట్నం కై లాసగిరి పోలీస్ గెస్ట్ హౌస్‌లో గురువారం వర్క్‌షాపు నిర్వహించారు. డీఐజీ గోపినాథ్ జెట్టి ఆదేశాల మేరకు విశాఖ రేంజి పరిధిలోని జిల్లాలకు చెందిన 36 మంది పోలీసులు హాజరయ్యారు. నేర సంఘటనల విచారణలో మొబైల్ లొకేషన్ ఆధారంగా నేరస్థులను గుర్తించడంలో ఉబెర్ డేటా ప్రాముఖ్యతను వివరించారు. లీగల్ ప్రాసెస్, డేటా రిక్వెస్ట్, అందుబాటులో ఉండే సమాచార రకాలు, ప్రైవసీ పరిరక్షణ వంటి అంశాలపై చర్చించా రు. జిల్లా నుంచి ఐటీకోర్, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, సైబర్ బృందం శరత్‌చంద్ర, గిరి, సుధీర్ తదితరులు హాజరయ్యారు.

కార్మికుల పొట్ట కొట్టవద్దు

ఇచ్ఛాపురం రూరల్: ఉద్యోగాలు ఇవ్వాల్సింది పోయి విధు ల్లో ఉన్న వారిని తొలగించడం సరికాదని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. గురువా రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం హయాంలో కిడ్నీ రోగుల కోసం ఉద్దానం ప్రాంతంలో సుమారు రూ.700 కోట్లు వెచ్చించి మేఘ సంస్థకు నిర్వహణ బాధ్యతలను అప్పగించి వంశధార నుంచి తాగునీటిని తెప్పించిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్వహణకు డబ్బులు కేటాయించకపోవడంతో 1997 నుంచి ఉద్దానం మంచినీటి పథకంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తూ వచ్చిన 105 మంది కార్మికులకు మేఘ సంస్థ తొలగించిందని, దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సంబంధిత సంస్థ ద్వారా మరల కార్మికులను ఉద్దానం ప్రాజెక్ట్‌లో చేర్చుకోవాలని, లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

బంగారం గొలుసు చోరీ

సారవకోట: తొగిరి గ్రామానికి చెందిన బల్ల లక్ష్మణరావు(71) మెడలో నుంచి బంగారం గొలుసును దుండగులు తెంచుకుపోయారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. లక్ష్మణరావు కోటబొమ్మాళి మండలం నారాయణవలస సంతకు గురువారం ఉదయం వెళ్లాడు. సరుకులు కొనుగో లు చేసిన అనంతరం స్వగ్రామం వచ్చేందుకు ఆటో ఎక్కాడు. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు వృద్ధుడ్ని మాటల్లో పెట్టి ముప్పావు తులం బంగారం గొలుసు చోరీ చేశారు. దీనిని గమనించని వృద్ధుడు వడ్డినవలస వద్ద ఆటో దిగి గ్రామానికి చేరుకున్నాడు. ఇంటికి వెళ్లి చూశాక గొలుసు చోరీకి గురైందని గుర్తించి సారవకోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పాత నేరస్తుల ఫోటోలు చూపించగా నిందితుల ఫొటోలను వృద్ధుడు గుర్తించాడు. ఆటో డ్రైవర్ సైతం మహిళా నేరస్తులను గుర్తించా డు. ఈ మేరకు వృద్ధుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు.

చదువుపై ఆసక్తి తగ్గి..
జీవితంపై విరక్తి కలిగి..

- ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్య
- ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఘటన
- స్వగ్రామం ఫరీదుపేటలో విషాద ఛాయలు



నరసింహనాయుడు మృతదేహం

ఎచ్చెర్ల/వేంపల్లి : వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పీయూసీ సెకెండియర్ చదువుతున్న ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన గురుగుబిల్లి నరసింహనాయుడు (17) ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం వేకువజామున వసతి గృహం బాత్‌రూమ్‌లో కిటికీకి నరసింహనాయుడు ఉరి వేసుకుని ఉండటాన్ని తోటి విద్యార్థులు గమనించి సిబ్బందికి సమాచారం అందించగా వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. విద్యార్థి మృతితో ఫరీదుపేటలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఏం జరిగిందో..

నరసింహనాయుడు తండ్రి అప్పలనాయుడు అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లి రాజు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తోంది. సోదరి శ్రావ్య కుప్పిలి ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. టెన్త్‌లో 576 మార్కులు రావడంతో ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. అక్కడ వసతి చాలకపోవడంతో ప్రస్తుతం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో వీరికి తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో చురుగ్గా ఉండే విద్యార్థి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో అర్థం కావడం లేదని, మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని తల్లి చెబుతోంది. అనంతరం హుటాహుటిన ఇడుపులపాయ బయల్దేరివెళ్లింది.

ట్రిపుల్ ఐటీ ఇష్టం లేక..

నరసింహనాయుడుకు చదువులో మంచి పట్టుంది. పీయూసీ ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులు సాధించాడు. అయితే ట్రిపుల్ ఐటీలో చదవడం ఇష్టం లేనట్లు తెలిసింది. తాను నర్సింగ్ చేయాలని అనుకుంటున్నట్లు తోటి విద్యార్థులతో చెప్పేవాడు. చదవడం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకుంటానని చెబుతుండేవాడని తెలిసింది. విద్యార్థి నాలుగు రోజులుగా ముభావంగా ఉండేవాడని తోటి విద్యార్థులు డైరెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో విద్యార్థి సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని విచారణ చేస్తున్నారు. కాగా, విద్యార్థి మృతి పట్ల విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

క్రైమ్ కార్నర్

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మిత్రులు మృత్యువాత
- దుప్పిలపాడులో విషాదఛాయలు



ఘటనా స్థలంలో మృతదేహాలు



అప్పన్న(ఫైల్)



గంగయ్య(ఫైల్)

టెక్కలి రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణస్నేహితులు దుర్మరణం పాలైన ఘటన కోటబొమ్మాళి మండలం శ్రీపురంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కోటబొమ్మాళి మండలం దుప్పిలపాడుకు చెందిన సబ్బి అప్పన్న (35) హైదరాబాద్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. కొద్ది రోజుల కిందటే స్వగ్రామం వచ్చాడు. గురువారం అత్తవారి గ్రామమైన పాకివలస వెళ్లాడు. అక్కడ స్నేహితుడు పిట్ట గంగయ్య(32)తో కలిసి సమీపంలోని తర్లిపేటలో ఉన్న దాబాకు వెళ్లారు. భోజనం చేశాక తిరిగి పాకివలస వస్తుండగా శ్రీపురం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. హెల్మెట్లు లేకపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు. మృతదేహాలను శవపంచనామ నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. అప్పన్నకు భార్య లావణ్య, పిల్లలు ప్రియాంక, హారిక, మణికంఠ ఉన్నారు. గంగయ్యకు భార్య వాణిశ్రీ, పిల్లలు నిఖిల్, దీక్షిత్ ఉన్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలియడంతో కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శాసనపురి వెంకటరావు (ఫైల్)

పలాస: పలాస లేబరుకాలనీలో నివాసముంటున్న శాసనపురి వెంకటరావు(59) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటరావు బుధవారం ఉదయం శ్రీకాకుళంలోని తన కుమార్తె చదువుకు సంబంధించిన సర్టిఫికెట్ల కోసం వెళ్లాడు. తిరిగి రాత్రి 8 గంటల సమయంలో స్వగ్రామం గొప్పిలి వెళ్లడానికి బెండిగేటు నుంచి టెక్కలిపట్నం వెళ్తుండగా మోదుగులపుట్టి వద్ద బైక్ అదుపు తప్పింది. తలకు బలమైన గాయాలు కావడంతో కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో 108లో శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కాశీబుగ్గ ఏఎస్‌ఐ ప్రకాశరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం



గోవిందరాజులు (ఫైల్)

రణస్థలం: లావేరు మండలం బుడుమూరు కూడలి సమీపంలో గురువారం తెల్లవారుజామున రోడ్డు పక్కన నడుస్తున్న బొడ్డ గోవిందరాజులు (66)ను శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని స్వగ్రామం విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం బక్కన్నపాలెం. బుడుమూరులోని కుమార్తె ఇంటికి పది రోజుల కిందట వచ్చాడు. ఉదయం బహిర్భూమికి వెళ్లి రోడ్డు పక్కన నడుస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లావేరు ఏఎస్సై ప్రసాదరావు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

గణేష్ మంటపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి



• ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: రానున్న వినాయక చవితి సందర్భంగా గణేష్ మంటపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్పీ వకుల్ జిందల్ గురువారం స్పష్టం చేశారు. అలాగే మంటపాల ఏర్పాటుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించబోయే వ్యక్తులు ముందుగా ఒక కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సింగిల్ విండో విధానంలో జ్ఞి ఇట://జ్బ ఛ్బటజ్బ ఙ్కుబ్రి. ఛ్బ క్లిక్ చేసి, నిర్దేశించిన అనుమతులు పొందాలని సూచించారు. ఈ విధానం వల్ల సులభంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, మంటపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనానికి అనుమతులు పొందవచ్చునని ఎస్పీ తెలిపారు.

తెలుగు కీర్తి పురస్కారానికి గురుప్రసాద్ ఎంపిక



తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపికైన గురుప్రసాద్

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షుడు, జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కార గ్రహీత సముద్రాల గురుప్రసాద్ తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరగనున్న తెలుగు భాషా దినోత్సవంలో ప్రతిష్టాత్మక తెలుగు కీర్తి పురస్కారం ఆయనకు ప్రదానం చేయనున్నారు.

పరుగు పందెంలో ప్రతిభ



క్రీడాకారుడిని అభినందిస్తున్న ఎంపీడీఓ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కుమరాం పాలవలసకు చెందిన క్రీడాకారుడు గదుల దుర్గారావు రాష్ట్రస్థాయి పరుగుపందెం పోటీల్లో ప్రతిభ చాటాడు. జిల్లా కేంద్రంలోని విజ్జి స్టేడియంలో జరిగిన 36వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ ఇంటర్ చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో 5000 మీటర్ల పరుగు పందెంలో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 9,10,11 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 5000 మీటర్ల పరుగుపందెంలో తృతీయ స్థానంలో నిలిచాడు. ఈ క్రీడాకారుడిని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం అభినందించారు. క్రీడల్లో మరింత ఆసక్తిని కనబరచాలని, క్రీడలు ఉన్నత స్థానంలో స్థిరపడేలా ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ కింతాడ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ టీటీఐలకు సత్కారం

తాటిచెట్లపాలెం(విశాఖ): వాల్తేరు రైల్వే డివిజన్ టికెట్ తనిఖీ సిబ్బంది మే నెలలో రికార్డు స్థాయిలో ఆదాయం సాధించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్ పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సిబ్బందిని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా గురువారం సత్కరించారు. మే నెలలో టికెట్ తనిఖీ సిబ్బంది వివిధ రూపాలలో రూ.2,41,20,627 ఆదాయాన్ని ఆర్జించారు. గత సంవత్సరం మే నెలలో సాధించిన రూ. 2,27,34,221 ఆదాయంతో పోలిస్తే, ఈసారి అధిక ఆదాయాన్ని నమోదు చేశారు. ఈ రికార్డు ఆదాయం సాధించడంలో వ్యక్తిగతంగా ఇద్దరు ఉద్యోగులు అద్భుతమైన పనితీరు కనబరిచారు. విజయనగరం, టీటీఐ వై. అప్పలరాజు.. 836 కేసులు నమోదు చేసి రూ. 4,89,320 జరిమానాలు, అదనపు టికెట్ రుసుముగా వసూలు చేశారు. శ్రీకాకుళం రోడ్డు టీటీఐ కె. శ్రీనివాసరావు 815 కేసులు నమోదు చేసి రూ. 4,42,900 వసూలు చేశారు. వారిద్దరిని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ సమక్షంలో సత్కరించారు.

వణికిస్తున్న వైరల్ జ్వరాలు

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
- రోజుల తరబడి తీవ్ర జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు
- ఏజెన్సీ కలబోసిన రెండు నియోజకవర్గాల్లో మరింత ప్రభావం



భద్రగిరి పీహెచ్‌సీలో వైద్యం కోసం వచ్చిన జ్వరపీడితులు



రక్త పరీక్షల కోసం నిరీక్షిస్తున్న రోగులు

పాలకొండ రూరల్/గుమలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా వైరల్ జ్వరాలు వణికిస్తున్నాయి. ప్రస్తుత సీజన్‌లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో కొత్త నీరు సమకూరడంతో పాటు పారిశుధ్య లోపం, డ్రైనేజీల సమస్యలు, నిల్వ ఉండే మురుగు కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. జ్వరప్రభావంతో తీవ్ర చలి, కీళ్ల నొప్పులు, ఆకలి లేకపోవడం, నోరు పూర్తిగా చేదుగా మారడంతో పాటు అధిక ఉష్ణోగ్రతతో కూడిన జ్వరం కనీసం 4-6 రోజులు కొనసాగడంతో జ్వర పీడితులు పూర్తిగా రోగ నిరోధక శక్తిని కోల్పోయే స్థితికి చేరుకుంటున్నారు.

ఏజెన్సీ కలబోసి ఉన్న ప్రాంతంలో..

ఏజెన్సీ ప్రాంతం అధికంగా మిళితమై ఉన్న పాలకొండ, కురుపాం నియోజకవర్గాల పరిధిలో దాదాపు ప్రతి ఇంటా జర్వ పీడితులు ఇద్దరు లేక ముగ్గురు ఉంటున్నారు. గడిచిన 20 రోజుల వ్యవధిలో పాలకొండ ఏరియా ఆస్పత్రిలో 848 మంది వివిధ రకాల జ్వరాలతో చేరారు. 705 మందికి టైఫాయిడ్ పరీక్షలు చేయగా 141 మందికి పాజిటివ్ వచ్చింది, డెంగీ పరీక్షలు 193 మందికి చేయగా నలుగురికి పాజిటివ్ వచ్చింది, 896 మందికి మలేరియా పరీక్షలు చేపట్టగా ఎనిమిది మందికి పాజిటివ్ వచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. దాదాపు 6 వందల మంది వైరల్, సాధారణ జ్వరాల బారిన పడినట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం ఇన్‌పేషెంట్లుగా వందకుపైబడి బాధితులు చేరినట్లు రికార్డులు చెబుతున్నాయి. సగటున రోజుకు ఆరు వందల మేరకు ఓపీ నమోదవుతున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. వారిలో అధిక శాతం జ్వరపీడితులే కావడం విశేషం.

చేతి సొమ్ము చెల్లించి..

సీజనల్ జ్వరపీడితులు రోగనిర్ధారణ పరీక్షలకు అధికమొత్తంలో చేతి సొమ్ము చెల్లిస్తున్నారు. సర్కారు దవాఖానాతో పోల్చుకుంటే రోగుల తాకిడి ప్రైవేట్ ల్యాబ్‌ల వద్ద అధికంగానే ఉంటోంది. గత ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పాటు జ్వరాలపై నిరంతర సర్వే కొనసాగడంతో సీజనల్ జ్వరాలు అదుపులో ఉండేవని గ్రామీణులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో అందించే మందులు కూడా ఆశించిన మేర అందుబాటులో ఉండడం లేదన్న వాదన వినిపిస్తోంది. ముఖ్యంగా బీపీ, గ్యాస్ట్రిక్, రోగనిరోధక శక్తిని అందించే ఐవీ, డైక్లోఫినాక్ ఇంజెక్షన్లు తక్కువగా పీహెచ్‌సీలకు చేరుతున్నట్లు స్పష్టమవుతోంది. నాలుగు నెలలకు ఓ సారి ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే మందుల్లో నిత్యావసర మందు బిళ్లలు, సూది మందులు తక్కువగా వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో రోగగ్రస్తులు ప్రైవేట్ ల్యాబ్‌లు, ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్, సీబీసీ, యూరిన్, ప్లేట్‌లెట్స్, వైరల్ జ్వర నిర్ధారణకు రు.600 చెల్లించాల్సి ఉంటుంది. డెంగీ, స్క్రాబ్ టైఫస్ వంటి ప్రాణాంతక జ్వరాల నిర్ధారణకు రూ.వెయ్యి వరకూ చెల్లించాల్సి వస్తుందని బాధితులు చెబుతున్నారు. ఈ లెక్కన ఇంట్లో ఇద్దరు ముగ్గురికి జ్వరం వస్తే రూ.వేలల్లో చేతి సొమ్ము చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

పారిశుధ్య లోపం..కలుషిత నీటి ప్రభావం..

జర్వరాల విజృంభణకు కలుషిత నీరు, పారిశుధ్య లోపమే ప్రధాన కారణంగా వైద్యులు చెబుతున్నారు. తాజాగా జిల్లాలో నమోదవుత్ను అధిక వర్షాల ప్రభావంతో నీటి వనరుల్లో కొత్తనీరు చేరుతోంది. ఎక్కిడికక్కడ మురుగు పేరకుపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రెండు విడతలు, తాజాగా 16వ ఆర్థిక సంఘానికి సంబంధించి ప్రస్తుత ఆగస్టు నెలలో విడుదల కావాల్సిన మొత్తాలు ఈ ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో బ్లీచింగ్, ఫినాయిల్ కొనేందుకు కూడా పంచాయతీల ఖాతాల్లో నిధులు లేవని ప్రజా ప్రతినిధులు వాపోతున్నారు. సొంత సొమ్ము చెల్లించి ఎంతోకొంత పనులు చేపడుతున్నా ఫలితం లేకపోతోందని అంటున్నారు.

తీవ్రమైన నొప్పులు



గతంలో ఎన్నడూ లేని విధంగా తీవ్రమైన నొప్పులతో కూడిన జ్వరాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఏ ఇంట చూసినా చిన్నాపెద్దా తేడా లేకుండా జ్వరాలు వస్తున్నాయి. రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నాం. స్థానికంగా అందిన వైద్యానికి నయంకాకపోవడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చింది.

పి.సులోచన, తాడికొండ, జీఎల్.పురం మండలం

జాగ్రత్తలు అవసరం



గతంతో పోల్చుకుంటే టైఫాయిడ్, మలేరియా కాకుండా వైరల్, సాధారణ జ్వరాలు నమోదువుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాచిచల్లార్చిన నీటిని తాగాలి. రోగ నిరోధక శక్తిని అందించే పౌష్టికాహారం తీసుకోవాలి. ముఖ్యంగా పిల్లల విషయంతో మరింత జాగ్రత్తలు పాటించాలి. వర్షంతో తడవనీయ కూడదు. దుమ్ము ధూళిలో ఆటలాడనీయొద్దు. జలుబు, దగ్గు వస్తే అలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

డాక్టర్ రవికుమార్, ఏరియా ఆస్పత్రి, పాలకొండ

రహదారుల నిర్మాణంలో ప్రభుత్వ నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

• ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంత రహదారులకు నెల రోజుల్లోనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని కూటమి ప్రభుత్వం మాట ఇచ్చి నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గురువారం రేగిడి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్-ఒడిశా రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న పాలకొండ-రాజాం ప్రధాన రహదారి పలు చోట్ల పూర్తిగా పాడవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా మజ్జిరాముడుపేట, ఉంగరాడమెట్ట, చిన్నయ్యపేట గ్రామాల జంక్షన్ల వద్ద సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.8.82 కోట్ల నిధులు రోడ్ల కోసం మంజూరుచేసిందని, ఆ నిధులతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంతమేర పనులను పూర్తిచేశారన్నారు. అప్పట్లో ఎన్నికల కారణంగా నిలిచిపోయిన రూ.4కోట్లు బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ మిగిలిన పనులను పూర్తిచేసేందుకు ముందుకురావడంలేదన్నారు. రాజాం జీఎంఆర్ ఐటీ వద్ద 355 మీటర్లు, ఉంగరాడమెట్ట వద్ద 395 మీటర్లు, మజ్జిరాముడుపేట వద్ద 150 మీటర్లు సిమ్మెంట్ కాంక్రీట్ రోడ్డు వేయాల్సి ఉందని, కాంట్రాక్టర్‌కు బకాయిలు చెల్లిస్తే తప్ప ఈ రోడ్డు పనిపూర్తిచేయలేమని ఇప్పటికే కాంట్రాక్టర్ చేతులెత్తేశాడన్నారు.

చెప్పిందొకటి..చేస్తున్నదొకటి

ఈ సమస్యను పలుమార్లు ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇటీవల కలెక్టర్ అంబేడ్కర్ సంకిలి నాగావళిని చూసేందుకు వచ్చిన సమయంలో ఈ గోతులను స్వయంగా చూశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం చెప్పిందొకటి, చేస్తున్నది ఒకటి, ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ప్రగల్భాలు పలుకుతుండడం వారికి వెన్నతోపెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకుంటే శాసనమండలి సమావేశాల్లో ఈ సమస్యను ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని స్పష్టం చేశారు. సమావేశంలో పోలినాటి వెలమ రాష్ట్ర మాజీ డైరెక్టర్ కింజరాపు సురేష్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, లక్ష్మీపురం సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావులు ఉన్నారు.

పోర్టల్‌లో నమోదు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న టీఓఎఫ్ఈఐ జిల్లా నోడల్ అధికారి చొక్కాపు శ్రీనివాస రావు

పార్వతీపురం టౌన్: జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు తమ నోడల్ ఉపాధ్యాయుల ద్వారా మైజీటీవీ.ఐస్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని టీఓఎఫ్ఈఐ జిల్లా నోడల్ అధికారి చొక్కాపు శ్రీనివాస రావు తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో పొగాకు వాడకం లేని కార్యక్రమాలుగా పోస్టర్ ప్రదర్శనలు, వీధి నాటకాలు, నినాదాల ప్రదర్శనలు, ర్యాలీలు కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. వాటి వీడియోలు, ఫొటోలను వెబ్‌సైట్‌లో ఈ నెల 31 లోపు అప్‌లోడ్ చేయాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు అమలు కావాలని స్పష్టం చేశారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 50 వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హేమసుందర్రావు తదితరులు పాల్గొన్నారు.

నేరాల దర్యాప్తులో డిజిటల్ ఆధారాలు కీలకం



ఉబెర్ డేటా డిస్‌క్లోజర్ పాలసీ సదస్సుకు హాజరైన ఎస్సైలు

• డీఐజీ గోపీనాథ్ జెట్టి

విజయనగరం క్రైమ్: నేరాల దర్యాప్తులో డిజిటల్ ఆధారాలే కీలకమని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. ఈ మేరకు రేంజ్ పరిధిలోని అయిదు జిల్లాలకు చెందిన ఐటీ అనుభవం కలిగిన పోలీస్ సిబ్బందికి గురువారం కైలాసగిరి పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఉబెర్ డేటా డిస్‌క్లోజర్ పాలసీపై వర్క్ షాప్ జరిగింది. నేర సంఘటనలకు సంబంధించి నమోదైన కేసుల విచారణంలో మొబైల్ లొకేషన్ ఆధారంగా నేరస్థులను గుర్తించడంలో ఉబెర్ డేటా ప్రాముఖ్యం గురించి వివరించారు. లీగల్ ప్రాసెస్, డేటా రిక్వెస్ట్ చేయడం, అందుబాటులో ఉంటే సమాచార రకాలు, ప్రైవసీ పరిరక్షణ వంటి అంశాలపై సదస్సు జరిగింది. రేంజ్ పరిధిలో ఉన్న ఐదు జిల్లాల నుంచి ఐటీ కోర్ టీమ్, సైబర్ సెల్ సిబ్బంది పాల్గొని, సాంకేతికతపై సమగ్రంగా చర్చలు జరిపారు.ఈ సందర్భంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు పోలీసుల సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరిచే దిశగా ఎంతో సహాయపడతాయని అన్నారు.

చిచ్చు పెట్టిన 'ఉచిత బస్సు'

• వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బైండోవర్ కేసు

విజయనగరం క్రైమ్ : మహిళలకు కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్ పథకం విజయనగరంలో చిచ్చు పెట్టింది.ఇందుకు సంబంధించి వన్ టౌన్ పోలీసులు గురువారం తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సింహాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్ విజయనగరం, సింహాచలం ట్రిప్పులో విజయనగరంలోని గాజులరేగకు చెందిన బూడి ఉమామహేశ్వరితో పాటు మరి కొందరు మహిళలు సింహాచలం వెళ్లారు. సింహాచలం కొండపై సీటు విషయంలో డ్రైవర్ ఎస్వీ రమణ తో గొడవకు దిగారు. బస్సులో మహిళలను వెనక సీట్‌లో కూర్చోవాలని, కొంతమంది పురుషులు ఎక్కారని టిక్కెట్ సర్వీసు చేయాలన్నారు. దీంతో మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని బస్ ఎక్కడమే తప్పా? అంటూ గాజులరేగకుచెందిన మహిళలు డ్రైవర్‌తో వాదులాటకు దిగారు. దీంతో డ్రైవర్ కూడా టిక్కెట్ సర్వీస్ అయితే బస్సుకు తద్వారా సంస్థకు ఆదాయం వస్తుందని కొంచెం సర్దు కోవాలని చెప్పాడు. అటు డ్రైవర్, ఇటు మహిళ పాసింజర్ల మధ్య గొడవకు దారి తీసింది. అది కాస్త దుర్భాషలకు చేరింది. ట్రిప్పులో భాగంగా బస్ సర్వీసు విజయనగరం చేరుకుంది.

అంతలోనే సదరు మహిళలు ఇంట్లో వారికి చెప్పడంతో భర్తలతో కలిసి సాయంత్రం ఆరున్నర గంటల ప్రాంతంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. సదరు డ్రైవర్‌ను స్టేషన్‌కు పిలిపించి పోలీసులు ప్రశ్నించగా చివరకు తప్పయిందని డ్రైవర్ చెప్పినట్లు స్టేషన్ ఏఎస్సై జగన్మోహన్ రావు తెలిపారు.

మందులు కొరత లేకుండా చూసుకోవాలి



హెచ్‌కారాడవలసలో తనిఖీలు చేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

• బందలుప్పి వైద్యాధికారి డా.శ్రీకాంత్

పార్వతీపురం రూరల్: దీర్ఘకాలిక వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధులు ఉన్న వారికి 104 వైద్యశిబిరం ద్వారా నెలకు సరిపడా మందులు పూర్తిస్థాయిలో అందించి సరఫరా చేసేందుకు మందుల కొరత లేకుండా చూసుకోవాలని బందలుప్పి వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు బందలుప్పి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఉన్న హెచ్ కారాడ వలసలో 104 వైద్య శిబిరాన్ని ఆయన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60సంవత్సరాల పైబడిన వారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులిస్తూ పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో అనారోగ్యం బారిన పడిన వారికి ప్రతి రోజు వైద్యపరీక్షలు చేస్తూ ఎలాంటి లక్షణాలు గుర్తించినా మెరుగైన వైద్యం అందించాలన్నారు.

రామతీర్థంలో వైభవంగా పూర్ణాహుతి



యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పుష్యమి నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో రామాయణంలో పట్టాభిషేకం సర్గ హవనం చేసి పూర్ణాహుతి జరిపించారు. ఆలయంలోని వెండి మంటపంలో ఉత్సవమూర్తుల వద్ద నిత్య కల్యాణం జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తి శ్రద్ధలతో తిరువాయ్ మోజి సేవాకాలం: విజయనగరం పట్టణానికి చెందిన పలువురు మహిళా భక్తులు స్వామి సన్నిధిలో తిరువాయ్ మోజి సేవాకాలాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గోష్ఠి ప్రతినిధి రమాదేవి ఆధ్వర్యంలో తిరువాయ్ నామాలను పఠించారు. కార్యక్రమంలో ఈఓ వై శ్రీనివాస రావు, అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్, రామగోపాలాచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి



శ్యామల మృతదేహం

రామభద్రపురం: మండలంలోని తారాపురంలో ఓ మహిళ అనుమానస్పద స్థితిలో గురువారం మృతిచెందింది. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తారాపురం గ్రామానికి చెందిన తుమరాడ శ్యామల(41)కు 20 ఏళ్ల క్రితం ఇదే మండలం జన్నివలస గ్రామానికి చెందిన పత్తిగుళ్ల అప్పలనాయుడుతో వివాహం జరిగింది. అయితే భార్యాభర్తల మధ్య కొద్దిపాటి మనస్పర్థలతో వివాహం జరిగిన రెండేళ్లకే విడాకులు తీసుకుని విడిపోయారు. దీంతో శ్యామల గడిచిన 18 ఏళ్ల నుంచి కన్నవారి ఊరు తారాపురంలో వారు ఇచ్చిన పూరింట్లో ఒంటరిగా నివాసం ఉంటూ కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇంతలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. వారిద్దరి మధ్య ఏం జరిగిందో గాని గురువారం తెల్లారేసరికి పురుగు మందు తాగి చనిపోయి ఉంది. పురుగు మందు డబ్బా కూడా మృతదేహం పక్కనే ఉంది. కుటుంబ సభ్యులు పురుగు మందు డబ్బా మురుగు కాల్వలో పారేసి మృతదేహాన్ని దహనం చేసేందుకు శ్మశానానికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు.అయితే మృతురాలి అన్నయ్య తుమరాడ సింహాచలం తన చెల్లిది మృతికి కారణం ఆత్మహత్య కాదని, అనుమానాస్పదంగా ఉందని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్సై అప్పారావు సిబ్బందితో కలిసి తారాపురంలోని ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విజయనగరం నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. అలాగే శ్యామల మృతికి గల కారణాలను గ్రామంలోని చుట్టుపక్కల నివాసాల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి అన్నయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎవరు చేశారీ పని?

• కలెక్టరేట్ పేరుతో ఉన్న అక్షరాలను తొలగించే ప్రయత్నం



బోర్డులో తొలగించిన అక్షరాలు

పార్వతీపురం రూరల్: కలెక్టరేట్ ముఖద్వారం వద్ద ఉన్న బోర్డులో కలెక్టర్ కార్యాలయం అని సూచించే పదాల అచ్చులను గుర్తుతెలియని అకతాయిలు బుధవారం రాత్రి తొలగించారు. ఈ క్రమంలో కొన్ని పదాలకు సంబంధించిన అక్షరాలు బోర్డులో గురువారం ఉదయం లేకపోవడాన్ని సిబ్బంది గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ మేరకు డీఆర్ఓ కె.హేమలత, ఈ చర్యలను తీవ్రంగా పరిగణించి పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చి దర్యాప్తు చేయాలని కోరారు. ఈ మేరకు పార్వతీపురం ఏఎస్పీ అంకితా సురానా, సీఐ కె.మురళీధర్ పరిశీలించి స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

అత్తారింటి వేధింపులపై కేసు నమోదు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని కొత్తవలసలో ఉన్న విజయరామరాజు కాలనీకి చెందిన ఓ వివాహిత భర్తతో పాటు అత్తమామలపై వేధింపుల కేసు పెట్టింది. నిత్యం తనను వేధిస్తూ అధిక కట్నం కోసం డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై గోవింద తెలిపారు.

వినాయక మంటపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

• ఎస్సై ఎం.వెంకటరమణ



మక్కువ: ఈనెల 27వ తేదీ నుంచి భక్తులు జరుపుకోనున్న వినాయకచవితి పండగ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటుచేయనున్న వినాయక మంటపాలకు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్సై ఎం.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో మంటపాలు ఏర్పాటుచేయనున్న భక్తులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలపాలన్నారు. మంటపాల వద్ద డీజేలకు అనుమతిలేదన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా బాణాసంచా కాల్చరాదని, గ్రామాల్లో ఎటువంటి గొడవలుకు తావులేకుండా ప్రశాంతవాతావరణంలో వినాయకచవితి పండగను భక్తులు జరుపుకోవాలని కోరారు. ఏవిధమైన సంఘటనలకు పాల్పడినా కమిటీసభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

ఆక్రమణలకు అడ్డేలేదా?



మండల పరిషత్ ప్రహరీని జేసీబీతో కూల్చివేసిన ఆక్రమణదారులు

- ప్రభుత్వ కార్యాలయాల్లోకి చొరబడుతున్న ఆక్రమణదారులు
- మండల పరిషత్ కార్యాలయ ప్రహరీ జేసీబీతో కూల్చివేత
- కార్యాలయం ఆవరణలో స్థలం యంత్రాలతో చదును
- అడ్డుకున్న మండల పరిషత్ అధికారులు



ప్రహరీ లోపల స్థలాన్ని చదును చేసిన దృశ్యం

చీపురుపల్లి: ఆక్రమణదారులకు ఎక్కడైతే ఏముంది. అది ప్రభుత్వ కార్యాలయం కావొచ్చు, ప్రైవేట్ స్థలం అవ్వొచ్చు. ఏదైనా సరే అధికార పార్టీ అండ ఉంటే చాలు ఎలాంటి స్థలంలోనైనా సరే చొరబడిపోవడమే. అయితే ఇంతవరకు ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలను ఆక్రమించుకునే ప్రయత్నాలు చూసి ఉంటాం. కానీ ఇక్కడ సాక్షాత్తు మండల పరిషత్ కార్యాలయం వెనుక ప్రహరీని కూల్చి కార్యాలయం ఆవరణలోకి చొరబడి జేసీబీతో మండల పరిషత్ కార్యాలయం ప్రహరీ లోపల ఉన్న స్థలాన్ని చదును చేసిన సంఘటన సంచలనం రేకెత్తిస్తోంది. ఇదే ప్రహరీకి అవతలి వైపు ఉన్న శ్మశాన వాటిక అభివృద్ధి పనులను మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ గద్దే బాబూరావు చేయిస్తున్నారు. ఈ సమయంలో మండల పరిషత్ ప్రహరీని కూల్చి లోపలకు ప్రవేశించి చదును చేయించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మండల పరిషత్ గోడ కూల్చి లోపలికి వచ్చి పనులు చేయిస్తుండడాన్ని తెలుసుకున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ ఐ.సురేష్ పనులను నిలిపివేయించారే తప్ప వారిపై చర్యలకు ముందడుగు వేయకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. మండల పరిషత్ కార్యాలయ ప్రహరీ లోపల ఆక్రమణలకు పాల్పడుతున్న స్థలంలో తాగునీటి పైపులు ఉండగా వాటిని తొలగించి ఓ పక్కన పడేయడంతో పైప్‌లైన్ సంగతి ఏమైందో ఇంకా తెలియాల్సి ఉంది.

సర్వేచేసి చర్యలు తీసుకుంటాం

ప్రహరీ కూల్చి లోపలికి వచ్చి చేపడుతున్న పనులను నిలిపివేశాం. పనులు చేస్తున్న వారిని హెచ్చరించాం. మండల పరిషత్ కార్యాలయం స్థలం ఎంత వరకు ఉందో సర్వే నిర్వహించి, త మ కార్యాలయం పరిధిలోకి ఆక్రమణలు వచ్చి నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. – ఐ.సురేష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ, చీపురుపల్లి